క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న 11 గోవుల స్వాధీనం

నర్సంపేట రూరల్ : అక్రమంగా తరలిస్తున్న 11 గోవులను పోలీసులు స్వాధీనం చేసుకుని వర్ధన్నపేట గోశాలకు తరలించారు. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం .. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి ప్రత్యేక వాహనంలో 11 గోవులను కొమ్మాల అంగడిలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ వద్ద పోలీసులు అడ్డుకుని విచారణ చేపట్టారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని వర్ధన్నపేటలోని గోశాలకు తరలించడంతోపాటు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సందర్భంగా సీఐ తెలిపారు.

తేమ శాతం 18కి మించొద్దు



పర్వతగిరి : రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతం 18కి మించకుండా చూసి కాంటా వేసి మిల్లుకు పంపాలని డీసీఓ సంజీవరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని, చౌటపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీసీఓ సంజీవరెడ్డి సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్, మాయిశ్చర్ మిషన్, టార్పాలిన్లు, కాంటాలు సెంటర్, నిర్వహణ పుస్తకాలు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు తాగునీరు, నీడను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు మిల్లుల నుంచి ట్రక్ సీట్లు తెప్పించుకొని రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని చెప్పారు. రైతులు ధాన్యాన్ని తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్‌లో శుద్ధి చేయించి కాంటా పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీసీలు కాంతయ్య, రమాదేవి, సుధాకర్, రవీందర్, రాజు, వివోఏలు కరుణ, రజిత, అరుణ, మార్కెట్ కమిటీ మెంబర్స్, రైతులు పాల్గొన్నారు.

యువరైతుకు సన్మానం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన యువరైతు నరేశ్‌ను 12 గ్రామాలకు చెందిన రైతు మిత్ర సంఘాల సభ్యులు బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నరేశ్ యాసంగిలో 2 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడి సాధించాడు. ఈ క్రమంలోనే ఆయన పంట క్షేత్రాన్ని రైతు మిత్ర సంఘాల సభ్యులు బుధవారం పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మురహరి రంజిత్‌కుమార్, గుండెబోయిన రవీందర్ పాల్గొన్నారు.

అంతా రామమయం..

జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం నుంచే శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు వైభవంగా జరిపించారు. ఆత్మకూరులో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ‘కుడా’ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, ధర్మసాగర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కావ్య పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ధర్మసాగర్ : సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే శ్రీహరి



ఆత్మకూరులో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఎల్కతుర్తి : సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



శాయంపేటలో మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి దంపతులు



ఆత్మకూరులో ‘కుడా’ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



దామెర : కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు



పరకాల: శ్రీకుంకుమేశ్వస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణ వేడుకలు



ఐనవోలు : తాళి చూపుతున్న ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్



ఆత్మకూరు : సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు



ఎల్కతుర్తి : సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, తదితరులు



కమలాపూర్ : ఉప్పల్‌లో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

‘పల్లాను విమర్శించే స్థాయి శ్రీహరికి లేదు’

● జెడ్పీటీసీ సరిత

వేలేరు : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని జెడ్పీటీసీ చాడ సరిత, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని సోడాషపల్లిలోని పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీహరి దళిత దొర అని, ఆయన వెంట ఉన్న నాయకులను ఎవరిని కూడా ఎదగనివ్వరని విమర్శించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కడియం శ్రీహరి విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాళ్లు మొక్కినప్పుడు ఆయన దొంగ అని తెలియదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరికి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరిత

కుట్రలు, కుతంత్రాలకు పెట్టింది పేరు కడియం శ్రీహరని అని ఆరోపించారు. మరోసారి పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ సంపత్, కోఆప్షన్ సభ్యుడు జాని, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు భూపతిరాజు, సురేష్, శ్రీనివాస్, రాజు, మహేందర్, సంపత్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతోనే దిగుబడి

శాయంపేట : సేంద్రియ ఎరువులైన పేడ, చెరువు మట్టి, పచ్చి రొట్ట లాంటి కంపోస్ట్ ఎరువులను వినియోగించడం ద్వారా వ్యవసాయ భూమిలో భూసారం పెరిగి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రజ్వల్ సంస్థ కార్యకర్త పోతు సునీల్ అన్నారు. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో బుధవారం హెచ్‌అండ్‌ఎం ఆర్థిక సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రైతులందరూ వ్యవసాయ భూముల్లో రసాయనిక పురుగు మందులు అధికంగా వినియోగించడం వలన సారవంతమైన నేలలు కనుమరుగవుతున్నాయని, నిస్సహాయత వ్యవసాయ భూములుగా మారుతున్నాయని అన్నారు. రైతులందరూ వ్యవసాయ క్షేత్రాల నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షల చేసుకోవడం ద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఎస్‌పీకే పోషకాలు అధికంగా ఉన్నాయని, సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటం వలన సరైన దిగుబడి రావడం లేదన్నారు. సేంద్రియ కర్బనాన్ని పంట క్షేత్రాల్లో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సునీల్

మొరం తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

దామెర: అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు అనుమతులు లేకుండా జేసీబీతో మొరం తవ్వకాలు చేపట్టి నాలుగు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దీంతో ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



పరకాల : ప్రత్యేక పోలీసు బలగాల కవాతు



నడికూడ : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరకాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పరకాల సీఐ రవిరాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణంలో బుధవారం కవాతు నిర్వహించారు. జాతీయ జెండాలతో పోలీసులు చేపట్టిన కవాతును ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలతో పాటు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీసు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ రవిరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం సీఆర్‌పీఎఫ్ బెటాలియన్, పరకాల పోలీసులు మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ విధిగా ఓటు వేయాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలకు మోక్షమెప్పుడో..!

- పనులు పూర్తి అయినా నిరుపయోగంగా తహసీల్దార్ కార్యాలయం
- దాతలు భూమి ఇచ్చినా ఫలితం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు
- దృష్టిసారించని పాలకులు

దామెర : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడంతో పాటు నూతనంగా మండలాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, కోగిల్వాయి, పులుకుర్తి, పసరగొండ, దమ్మన్నపేట, ఒగ్లాపూర్, ఊరుగొండ, దుర్గంపేట, సీతారాంపూర్, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లిని కలుపుకొని మొత్తం 14 గ్రామాలతో అక్టోబర్ 11, 2016 సంవత్సరంలో దామెరను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు మండల కేంద్రంలో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలను తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేసి కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు. మండలంగా ఏర్పాటై 8 సంవత్సరాలు గడుస్తున్నా నూతన భవనాల నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం నిత్యం మండలానికి చాలా మంది వస్తున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి వసతులు లేకపోవడంతో అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూర్చునేందుకు ఏర్పాట్లు కూడా సరిగా లేకపోవడంతో చెట్ల క్రింద కూర్చోవాల్సి వస్తోందని, కనీస సౌకర్యాలు కల్పించలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత కార్యాలయాల పరిస్థితి..

తహసీల్దార్ కార్యాలయాన్ని, పోలీస్ స్టేషన్లను తాత్కాలికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గదుల్లో ఏర్పాటు చేశారు. అలాగే ఎంపీపీ, ఎంపీడీఓ కార్యాకలాపాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని మండల విద్యా వనరుల భవనంలో ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖను రైతు వేదికలో, మహిళా సమాఖ్య భవనం, విద్యుత్‌శాఖను అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం దామెర గ్రామానికి చెందిన కాసర్ల వంశస్తులు 3.20 ఎకరాల భూమిని ప్రభుత్వ భవనాల కోసం విరాళమిచ్చారు. ఇందులోని అర ఎకరం భూమిలో తహసీల్దార్ కార్యాలయం నిర్మించి గత సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రారంభించారు. కానీ ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్న కారణంగా తహసీల్దార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మర్చలేదు. అదే విధంగా మిగితా భవనాల నిర్మాణాల పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్



నిరుపయోగంగా తహసీల్దార్ భవనం



చెట్టు కింద కూర్చున్న గ్రామస్తులు



ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం

చెట్ల కిందే కూర్చుంటున్నాం



మండలంలో ప్రభుత్వ కార్యాలయ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పనుల కోసం కార్యాలయాలకు వెళ్తే నిలువనీడ లేకపోవడంతో చెట్ల కింద కూర్చొని ఎదురు చూడాల్సి వస్తోంది. కాసర్ల వంశస్తులు ఇచ్చిన భూమిలో నిర్మాణాలు చేపట్టేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. త్వరలో నిర్మాణాలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి.

– శ్రీరాంరెడ్డి, దామెర మాజీ సర్పంచ్

నేటినుంచి లోక్‌సభ నామినేషన్ల స్వీకరణ

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- సభలు, వాహనాల ప్రచారం అనుమతులతోపాటు పలు అంశాలపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. అదేరోజు నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం ఉంది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను వరంగల్ జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు. సెలవులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ స్థానానికి సంబంధించి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పార్లమెంట్ నియోజక పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రచారం చేసే అభ్యర్థుల వాహనాల అనుమతులకు సువిధ ద్వారా రిటర్నింగ్ అధికారి పరిధిలో మంజూరు చేయాలని, సభలు, సమావేశాలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు లేదా ఎన్నికల అధికారుల స్థాయిలో మంజూరు చేయాలన్నారు. ఎస్ఎస్‌టీలు గురువారం ఉదయం నుంచి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు సకాలంలో రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 స్వీకరణ, అత్యవసర సర్వీసెస్, వృద్ధులు, దివ్యాంగుల హోం ఓటింగ్ ఈ నెల 25లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్‌కేంద్రంలో వీల్ చైర్లతోపాటు వలంటీర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పొరపాట్లు జరగొద్దు..

నామినేషన్లు స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మాక్ (ట్రయల్) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓలు శ్రీనివాస్, వైవీ గణేష్, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటేష్, సీదం దత్తు, మంగీలాల్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, సంజీవరెడ్డి, పుష్పలత, సౌజన్య, శ్రీకాంత్, విశ్వనారాయణ, రమేష్, చంద్రశేఖర్, ఏఓ శ్రీకాంత్, తహసీల్దార్లు ఇక్బాల్, విజయ్‌సాగర్, బండి నాగేశ్వర్‌రావు, డీటీ రంజిత్ పాల్గొన్నారు.

అభ్యర్థుల నిబంధనలు..

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు.
- అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వారైతే తప్పసరి వారి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చు.
- సంబంధిత బ్యాంకు ఖాతా లావాదేవీల ఆధారంగానే అభ్యర్థులు వ్యయాన్ని లెక్కిస్తారు.
- నామినేషన్ పత్రంలోని పార్ట్–3ఏ లో క్రిమినల్ కేసుల వివరాలు పొందుపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీల విషయంలో సెక్షన్ 127–ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

బీజేపీ అభ్యర్థి ‘అరూరి’ని ఆశీర్వదించాలి

కాశిబుగ్గ: వరంగల్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. 19వ డివిజన్ 143 బూత్‌లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు రఘునారెడ్డి, హరీష్, ఓం ప్రకాష్, బ్రహ్మచారి, వెంకటేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌ని గెలిపించాలి

కాజీపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో గళం వినిపించడానికి అవకాశం ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతూ సుధీర్ కుమార్‌తో కలిసి కాజీపేట ప్రధాన రహదారుల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయమాటకు మోసపోవద్దని అన్నారు.

మృతదేహానికి నివాళి

నర్సంపేట : పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 12వ వార్డు కమిటీ అధ్యక్షుడు గుడికందుల సంతోశ్ తండ్రి రాములు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి కాంగ్రెస్, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు బుధవారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు రాజేందర్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మసూద్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు సాంబయ్య, 13వ వార్డు ఇన్‌చార్జ్ మురళి, 20వ వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో ఇటీవల మరణించిన హసన్‌పర్తికి చెందిన గుడికందుల చంద్రయ్య కుటుంబానికి క్లాస్‌మెంట్స్ (1988–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్) చేయూతనిచ్చారు. ఈమేరకు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.21 వేల విలువగల చెక్కును బుధవారం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆకుతోట రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, సుదర్శన్, మాటేటి కుమారస్వామి, భిక్షపతి, రామరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.